అభివృద్ధిని నిర్లక్ష్యం చేయొద్దు

ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి

కొత్తూరు: ప్రస్తుతం గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతుండడంతో గ్రామాల అభివృద్ధి విషయంపై అధికారులు ఏమాత్రం నిర్లక్ష్యం వహించొద్దని ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమ వారం ఎంపీపీ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయా శాఖలకు చెందిన మండలస్థాయి అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో పంచాయతీల్లో పాలన కొరకు ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించినట్లు పేర్కొన్నారు. వారు తమ సొంత శాఖల విధులతో పాటు కేటాయించిన పంచాయతీల్లో ప్రజా సమస్యలను పరిష్కరించడానికి కృషి చేయాలన్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో ఇళ్ల మధ్యన ప్రమాదకరంగా మారిన విద్యుత్ తీగలు, స్తంభాలను సరిచేయాలని ఎంపీటీసీలు సభకు విన్నవించారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని ఎంపీపీ సూచించారు. అంతేకాకుండా ఆయా రకాల భూ సమస్యలను ధరణిలో పరిష్కరించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు విద్యాశాఖకు నివేదికలు పంపాలని సభ్యులు అధికారులకు తెలిపారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో అభివృద్ధి, ఇతర అంశాలపై చర్చించే అవకాశం లేని కారణంగా సమావేశాన్ని ముగించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, ఎంపీడీఓ అరుంధతి, వైస్ ఎంపీపీ శోభాలింగంనాయక్, ఆయా శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎఫ్‌టీఎల్‌లో నిర్మించిన షెడ్‌ను తొలగించాలి

కమిషనర్‌కు ఫిర్యాదు


ఎఫ్‌టీఎల్‌లో నిర్మించిన షెడ్

కొత్తూరు: మున్సిపాలిటీ పరిధిలోని సాయిరెడ్డి చెరువు ఎఫ్‌టీఎల్ లెవల్‌లో అనుమతులు లేకుండా నిర్మించిన షెడ్‌ను తొలగించాలని కోరుతూ కొత్తూరు తండావాసులు శనివారం కొత్తూరు మున్సిపల్ కమిషనర్ బాలాజీకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తండా సమీపంలోని సాయిరెడ్డి చెరువు ఎఫ్‌టీఎల్ లెవల్‌లో సర్వే నంబర్ 83లో కొంతమంది అనుమతులు లేకుండా షెడ్డును ఏర్పాటు చేసి వాటర్ ఫిల్టర్ కొనసాగిస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా సర్వే నంబర్ 66లోని ప్రభుత్వ పొలంలో అక్రమంగా నిర్మించిన షెడ్‌లను కూడా తొలగించాలని వారు కోరారు. కార్యక్రమంలో రెడ్యా, రాజు, బాలు, శ్రీధర్, గోపాల్ పాల్గొన్నారు.

పామాయిల్‌తో అధిక లాభాలు


మాట్లాడుతున్న ప్రమోద్‌కుమార్

కొందుర్గు: పామాయిల్ సాగుతో అధిక లాభాలు పొందవచ్చని జిల్లా మేనేజర్ ప్రమోద్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని తంగెళ్లపల్లిలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. తేలిక పాటి నేలల్లోనూ పామాయిల్ సాగు చేసుకోవచ్చని, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందవచ్చని తెలిపారు. ఇతర పంటలతో పోలిస్తే నికర లాభాలు అందించే ఏకైక పంట పామాయిల్ అని చెప్పవచ్చన్నారు. ఈ పంటలో మొక్కజొన్న, పత్తి, కూరగాయలు, చిరుధాన్యాలు అంతర పంటలుగా సాగుచేసుకోవచ్చన్నారు. పామ్ ఆయిల్ పంట సాగుకు ప్రభుత్వం రాయితీ అందిస్తుందని, మార్కెటింగ్ సదుపాయం కూడా కల్పిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ మల్లారెడ్డి, ఏఈఓ అనూష, రామకృష్ణ, మాజీ సర్పంచ్ బాల్‌రాజ్, రైతులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం


బాధితులకు నగదు అందిస్తున్న నాయకులు

కేశంపేట: మండల పరిధిలోని పోమాల్‌పల్లి గ్రామంలో ఇటీవల బావండ్ల జంగమ్మ, నిదురం భారతమ్మలు అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న స్త్రీ శిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ రూ.5వేలు, గ్రామ కాంగ్రెస్ కమిటీ తరఫున రూ.5వేలు దశదినకర్మల నిమిత్తం శనివారం ఆయా కుటుంబ సభ్యులకు 5వేల చొప్పున అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కృష్ణయ్య, మాజీ ఉపసర్పంచ్ అనుమగళ్ల రమేశ్, రాంచంద్రారెడ్డి, ముత్యాలురెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పుష్ప'మే'

సన్నని రేకులతో ఎర్రగా వికసించి కనిపిస్తున్నది పుష్ప'మే'. మే నెలలో మాత్రమే వికసించే ఈ పుష్పాలు.. మండల పరిధిలోని పెద్దమంగళారం గ్రామానికి చెందిన చేగూరి సుధాకర్‌గౌడ్ ఇంట్లో శనివారం వికసించాయి. ఏడాదిలో ఒక్కసారే వికసించే మే పుష్పాలను చుట్టుపక్కల వారు ఆసక్తిగా చూస్తున్నారు.

- మొయినాబాద్


వికసించిన మే పుష్పం

మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి


నర్సరీని పరిశీలిస్తున్న ఏపీవో సుశీల, సంధ్య

మండల ఏపీవో సుశీల

మొయినాబాద్‌రూరల్: నర్సరీల్లో పెంచుతున్న మొక్కలు ఎండిపోకుండా ప్రత్యేక దృష్టి సారించాలని మండల ఏపీవో సుశీల అన్నారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామ సమీపంలో గల నర్సరీని పంచాయతీ కార్యదర్శి సంధ్యతో కలిసి ఆమె పరిశీలించారు. నర్సరీలో పెరుగుతున్న మొక్కలను చూసి బాగా ఎదిగాయని తెలిపారు. గ్రామాల్లో పెంచుతున్న మొక్కలు వర్షాకాలం నాటికి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ వర్షాకాలంలో ప్రజలకు సరిపడే మొక్కలు అందించేందుకు ప్రభుత్వం ఇచ్చిన టార్గెట్ 10 వేలు కాకుండా మరొక వేయి మొత్తం 11 వేల మొక్కలను పెంచుతున్నట్లు పంచాయతీ కార్యదర్శి సంధ్య తెలిపారు. నర్సరీలో కానుగు, అశోక, జిందాతిలిస్మాత్, తులసి, మల్లె, గులాబీ, కరివేపాకు, బాదం, తదితర మొక్కలను పెంచుతున్నట్లు ఆమె తెలిపారు. నర్సరీని పరిశీలించిన ఏపీవో మొక్కలు ఎండిపోకుండా నిత్యం చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పత్తి రైతుకు నకిలీ బెడద

- అనుమతి లేని బీటీ– 3 విత్తనాలు అంటగడుతున్న వ్యాపారులు
- గ్రామీణ ప్రాంతాల్లోని దుకాణాల్లో విక్రయాలు
- నష్టపోతున్న అన్నదాతలు

షాబాద్: జిల్లాలో పత్తి రైతులను నకిలీ విత్తనాల బెడద తీవ్రంగా వేధిస్తోంది. అనుమతి లేని బీటీ– 3 విత్తనాల కారణంగా దిగుబడులు కోల్పోతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు విత్తన ఎంపికపై అవగాహన లేకపోవడాన్ని ఆసరాగా చేసుకొని కొందరు వ్యాపారులు, దళారులు వీటిని అంటగడుతున్నారు. వారం రోజుల్లో వానాకాలం సీజన్ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో నకిలీ విత్తనాలకు చెక్ పెట్టాలని రైతులు కోరుతున్నారు.

ఉద్దెర పేరుతో ఎర..

వివిధ ప్రాంతాల నుంచి రహస్యంగా అనుమతి లేని బీటీ– 3 పత్తి విత్తనాలు తీసుకొస్తున్న దళారులు ఉద్దెర పేరుతో రైతులకు అమ్ముతున్నారు. మంచి దిగుబడి వస్తుందని, కలుపు తీయకుండా మందులు పిచికారీ చేయొచ్చని ప్రచారం చేస్తున్నారు. ఇంటికి వచ్చి విత్తనాలు అందజేయడం, డబ్బులు కూడా పంట వచ్చిన తర్వాత ఇవ్వండి అని చెప్పడంతో కొంతమంది రైతులు వీటిని తీసుకుంటున్నారు. అనుమతి లేని బీటీ– 3 విత్తనాలతో అనేక దుష్పరిణామాలు ఉంటాయని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ విత్తనాలు వేస్తే నేల నిస్సారం అవుతుందని, పంటల దిగుబడి రాదని, మనుషుల ఆరోగ్యంపై సైతం ప్రభావం చూపుతుందని పేర్కొంటున్నారు. అయినా దళారులు మాత్రం దందా మానడం లేదు. గ్రామాల్లోని విత్తనాల దుకాణాలు, కొంతమంది ఏజెంట్ల ద్వారా వీటిని విక్రయిస్తున్నారు. సంబంధిత అధికారులు, పోలీసులు స్పందించి రైతులు నకిలీ విత్తనాల బారిన పడకుండా చూడాలని రైతు సంఘాలు కోరుతున్నాయి.

గీత కార్మికుడి కుటుంబానికి సాయం

అబ్దుల్లాపూర్‌మెట్: ఇటీవల ప్రమాదవశాత్తు తాటి చెట్టుపై నుంచి కిందపడి మృతిచెందిన మండలంలోని మజీద్‌పూర్ గ్రామానికి చెందిన గీత కార్మికుడు గండేటి తేజ కుటుంబానికి కౌండిన్య అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా ట్రస్టు సభ్యులు ఆర్థిక సహాయం చేశారు. మృతుడి వివరాలను మోడెపు యాదగిరి గౌడ్ ద్వారా తెలుసుకున్న ట్రస్టు సభ్యులు వలంటీర్ల సహాయంతో బాధిత కుటుంబానికి రూ.20వేల ఆర్థిక సాయం అందించారు. వలంటీర్లు నాతి పాండు, నాతి రాఘవేంద్ర, నాతి గణేష్, మోడెపు యాదగిరి గౌడ్, అజయ్ కుమార్ గౌడ్, గీత కార్మికుల సంఘం గ్రామ అధ్యక్షుడు మేడిపల్లి అంజయ్య, గౌడసంఘం పెద్దలు పండాల నర్సిహ్మా, దర్శన్, మల్లేశ్, మేడిపల్లి రాములు, వెంకటేష్, జగన్, నగేశ్, చెరుకూరి శివశంకర్, నర్సింహ, పరమేశ్‌లు పాల్గొని కౌండిన్య అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా ట్రస్టు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

చర్యలు తీసుకోవాలి

ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు శివకుమార్


వినతిపత్రం ఇస్తున్న శివకుమార్

ఇబ్రహీంపట్నం: విద్యాహక్కు చట్టానికి తుట్లు పొడుస్తూ ముందస్తు అడ్మిషన్లు ప్రారంభించిన ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి. శివకుమార్ డిమాండ్ చేశారు. శనివారం ఇబ్రహీంపట్నంలోని విద్యాశాఖ అధికారులకు నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ నిబంధనలను పట్టించుకోకుండా ఇంటర్నేషనల్, టెక్నో ఒలంపియాడ్ వంటి పేర్లను ఉపయోగించుకుంటూ విద్యార్థులను, పేరేంట్స్‌ను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. అంతేగాక పెద్ద హోర్డింగ్‌లు, రకరకాల ప్రచారాలు చేస్తూ అడ్మిషన్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్పొరేట్ స్కూల్స్ పెద్దయెత్తున ఫీజుల దోపిడీకి పాల్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నత విద్యాశాఖ అధికారులు స్పందించి అలాంటి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు శ్రీకాంత్, ప్రవీణ్, శివ పాల్గొన్నారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

చేవెళ్ల: గుర్తు తెలియని యువకుడు చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధి శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని బుల్కాపూర్ సమీపంలోని రైల్వే ట్రాక్ పక్కన చెట్టుకు ఓ యువకుడు (35) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం ట్రైన్‌లో వెళ్తున్న ప్రయాణికులు గమనించి 100డయల్‌కు ఫోన్ చేసి చెప్పడంతో పోలీసులు అక్కడికి వెళ్లి పరిశీలించారు. అతడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మున్సిపల్ అధికారుల ఫిర్యాదు మేరకు గుర్తు తెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంతోష్‌రెడ్డి తెలిపారు.

పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

స్కూల్ గేటు ఎదుట బాధితుల ఆందోళన


ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు, నాయకులు

మొయినాబాద్: సమ్మర్ క్యాంపు నిర్వహించి విద్యార్థి మృతికి కారణమైన సుజాత స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలంటూ బాధిత కుటుంబ సభ్యులు, సురంగల్ గ్రామస్తులు, విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని నాగిరెడ్డిగూడ రెవెన్యూలోని పాఠశాల గేటు ఎదుట కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళన చేశారు. సమ్మర్ క్యాంపులో సురంగల్ గ్రామానికి చెందిన గాండ్ల శివశౌర్యన్(5) స్విమ్మిగ్‌పూల్‌లో మునిగి మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై అధికారులు, పోలీసులు చర్యలు తీసుకోవడం లేదంటూ బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఘటన జరిగి పది రోజులు అవుతున్నా పాఠశాల యాజమాన్యంపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలను సీజ్ చేయాలన్నారు.

బీసీల రిజర్వేషన్లు పెంచాలి



మాట్లాడుతున్న నాయకులు

చేవెళ్ల: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థలలో రిజర్వేషన్లు పెంచి ఎన్నికలకు వెళ్లాలని బీజేపీ మండల ఉపాధ్యక్షుడు గొండ్ల కృష్ణగౌడ్ అన్నారు. చేవెళ్లలోని పార్టీ కార్యాలయంలో శనివారం నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి ఇచ్చిన మాట నిలబెట్టుకునే చిత్తశుద్ధి ఉంటే బీసీ రిజర్వేషన్లను స్థానిక సంస్థల్లో 22 నుంచి 42శాతంకు పెంచాలన్నారు. బీసీల రిజర్వేషన్‌లను 50 శాతం పెంచుతామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డికి ఓబీసీల సంక్షేమంపై చిత్తశుద్ధి ఉంటే బీసీల రిజర్వేషన్‌లను పెంచిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. వెంటనే బీసీ జనగణన చేయించి బీసీ లెక్కలు తేల్చాలన్నారు. జనాభాలో సగం కంటే ఎక్కువగా ఉన్న బీసీలకు రాజకీయంగా అన్యాయం జరుగుతుందన్నారు. బీసీల జనాభా ప్రకారం రావాల్సిన రిజర్వేషన్లను కల్పించాల్సిందేనని డిమాండ్ చేశారు. లేదంటే పార్టీ తరఫున బీసీ సంఘాలను ఏకం చేసి ఉద్యమిస్తామన్నారు. సమావేశంలో నాయకులు కృష్ణమోహన్, మానిక్యం, మహేందర్, తదితరులు ఉన్నారు.

దేవాలయాల అభివృద్ధికి కృషి


విరాళం అందజేస్తున్న మహేందర్, తదితరులు

షాబాద్: దేవాలయాల అభివృద్ధికి బీజేపీ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని బీజేవైఎం యువ మోర్చా జిల్లా అధికార ప్రతినిధి కూతురు మహేందర్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని అంతిరెడ్డిగూడ గ్రామంలో బీరప్ప దేవాలయ నిర్మాణానికి పార్టీ తరఫున రూ.20వేల రూపాయలు విరాళంగా ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతనతోనే ప్రతీ ఒక్కరికి మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. గ్రామాల్లో బీరప్ప దేవాయాల నిర్మాణానికి ప్రజలు తమవంతు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు కావలి శివ, సీహెచ్ రాజు, సాయి, అరుణ్, సురేశ్, రమేశ్, శ్రీనివాస్, నవీన్, వివేక్, కుమార్, శంకరయ్య, దయాకర్‌చారి, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

ఫత్తేపూర్ ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ట్రాఫిక్‌జామ్


ట్రాఫిక్‌జామ్‌తో నిలిచిపోయిన వాహనాలు

ఇబ్బందిపడిన వాహనదారులు

చేవెళ్ల: శంకర్‌పల్లి మున్సిపల్ కేంద్రంలోని ఫత్తేపూర్ ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద భారీగా ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనదారులు ఇబ్బందిపడ్డారు. శనివారం శంకర్‌పల్లిలోని ఫత్తేపూర్ ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద నుంచి భారీ వాహనాలు పోవడం లేదని ఆర్అండ్‌బీ అధికారులు రోడ్డు తవ్వి మరమ్మతులు చేపట్టారు. దీంతో ఈ బ్రిడ్జి వద్ద నుంచి వచ్చి పోయే వాహనాలకు ఇబ్బంది ఏర్పడింది. దీనికి తోడు శంకర్‌పల్లిలో భారీ వర్షం కురవడంతో వాహనదారులకు నరకయాతనగా మారింది. ఈ బ్రిడ్జి వద్ద వన్‌వే రోడ్డు మాత్రమే ఉండడంతో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు ఈ మరమ్మతులతో మరింత ట్రాఫిక్‌జామ్ అయింది. ఈ బ్రిడ్జి వద్ద రోడ్డు సైతం గుంతలమయంగా ఉండటంతో నరకయాతన పడుతున్నారు. మరమ్మతుల కారణంగా రోడ్డుపై వాహనాలు కిలోమీటర్ల పొడవునా ట్రాఫిక్ జామ్‌తో శంకర్‌పల్లి పట్టణ కేంద్రం వరకు వాహనాలు నిలిచిపోయాయి. ఈ రోడ్డుపై వచ్చిన వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆర్అండ్‌బీ అధికారులు ముందుగా ఈ రోడ్డుపై, ఫ్లైఓవర్‌పై ఏర్పడిన గుంతలను పూడ్చివేయాలని కోరుతున్నారు.

ధరణి సమస్యలకు పరిష్కారమేదీ?

బీజేపీ యువ నాయకుడు వైభవ్‌రెడ్డి

చేవెళ్ల: బీఆర్ఎస్ హయాంలో రైతులు, ప్రజలు తీవ్రంగా ఇబ్బందిపడిన ధరణి సమస్యలు కాంగ్రెస్ పాలనలో తీరుతాయని ఆశిస్తే మరింత జఠిలంగా మారుతున్నాయని బీజేపీ యువ నాయకుడు ఎం.వైభవ్‌రెడ్డి అన్నారు. చేవెళ్లలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో ధరణి సమస్యలు మరింత దారుణంగా మారాయని వాపోయారు. ధరణితో రైతులు ఇబ్బంది పడుతున్నారని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే దీనిని పూర్తిగా తొలగిస్తామని లేదా సరిచేస్తామని ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. దీనికి తోడు అప్పట్లో ఉన్న ధరణి ఆప్షన్లను సైతం తొలగించి మరింత ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. ప్రస్తుతం ఈ ధరణి వెబ్‌సైట్ ద్వారా రైతులకు సంబంధించిన భూమి వివరాలను తెలుసుకునే ఈసీ, రిజిస్ట్రేషన్ సేల్ డీడీ డ్యాక్యుమెంట్‌లు కూడా డౌన్‌లోడ్ కావటం లేదన్నారు. కోర్టులో ఉన్న కేసులు పరిష్కారమైనా కూడా ధరణి వెబ్‌సైట్‌లోని ప్రొహిబీటెడ్ జాబితాలో నుంచి తొలగించటం లేదన్నారు. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ధరణిపై చేసింది ఏమిటని ప్రశ్నించారు. గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు పెట్టి ప్రజల మధ్య భూ సమస్యలను పరిష్కరిస్తామని చెప్పి గాలికి వదిలేశారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ధరణిపై ఏదో ఒక నిర్ణయం తీసుకొని రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేదంటే బీజేపీ ఆధ్వర్యంలో ధరణి సమస్యలపై ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

అనుమతుల్లేకుండా నిర్మాణాలు

నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్న అధికారులు


మంచన్ పహాడ్‌లో బేస్‌మెంట్ లెవల్‌లో నిర్మాణం


మొదళ్లగూడలో ఇంటి నిర్మాణం

నందిగామ: గ్రామ పంచాయతీల్లో పాలకవర్గం పదవీ కాలం ముగియడం.. ప్రత్యేక అధికారుల పాలన రావడంతో గ్రామాల్లో అక్రమ నిర్మాణాలు జోరుగా కొనసాగుతున్నాయి. అడ్డుకోవాల్సిన అధికారులు తప్పని పరిస్థితుల్లో నిర్మాణాదారులకు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండల పరిధిలోని మొదళ్లగూడ, మంచన్‌పహాడ్ గ్రామాల్లో ఇటీవల అనుమతులు లేకుండా ఇళ్ల నిర్మాణాలు జోరుగా కొ నసాగిస్తున్నారు. నిబంధనల ప్రకారం పాత ఇంటిని కూల్చి వేయాలన్నా, అదే స్థలంలో నూతన ఇంటిని నిర్మించాలన్నా సంబంధిత అధికారులతో అనుమతులు తీసుకొని కట్టడాలను నిర్మించాలి. కానీ ఈ గ్రామాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా కట్టడాలు నిర్మిస్తున్నారు. అడ్డుకోవాల్సిన అధికారులు నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆయా గ్రామాల్లో కొనసాగుతున్న కట్టడాలను అడ్డుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నోటీసులు ఇచ్చినా.. కొనసాగుతున్న పనులు

మొదళ్లగూడలో ఇళ్ల నిర్మాణానికి సంబంధించి బేస్‌మెంట్ మొదలు పెట్టినప్పటి నుంచి అధికారులు నోటీసులు జారీ చేస్తున్నా కూడా పనులు ఏ మా త్రం ఆపలేకపోవడం. ముచ్చటగా మూడుసార్లు నోటీసులు ఇచ్చేలోగా రెండో అంతస్తు పనులు పూర్తి కావాల్సి వస్తున్నాయి. కానీ పనులు మాత్రం నిరంతరంగా కొనసాగుతున్నాయి.

నోటీసులు జారీ చేశాం..

ఆయా గ్రామాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా కట్టడాలు చేస్తున్న విషయం వాస్తవమే. కట్టడాలు నిర్మిస్తున్న వారికి నోటీసులు సైతం జారీ చేశాం. పనులు కూడా నిలిపివేయించాం. మొదళ్లగూడలో నిర్మిస్తున్న ఇంటికి సంబంధించి స్థలం విషయమై కుటుంబ సభ్యుల మధ్య కేసు న్యాయస్థానంలో ఉంది. రెండు గ్రామాల్లో నిర్మిస్తున్న ఇళ్లకు అనుమతులు లేవు. పనులు నిలిపివేయించాం.

– శ్రీనివాస్, ఎంపీఓ, నందిగామ మండలం